క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

పర్వతగిరి : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్(ఆదర్శ)లో ప్రవేశాలకు అర్హత కలిగిన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ గణేష్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ.. 6వ తరగతిలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని అన్నారు. 7, 8, 9, 10తరగతుల్లో మిగిలిన సీట్ల కోసం విద్యార్థులు ఈనెల 15వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 16న ఉంటుందన్నారు. అర్హులైన ప్రతీ విద్యార్థి దరఖాస్తు చేసుకొని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బియ్యం అందజేత

నర్సంపేట రూరల్ : నర్సంపేట పట్టణంలోని రిక్షా యూనియన్ అధ్యక్షుడు భూషనబోయిన లక్ష్మయ్య ఇటీవల మృతిచెందాడు. కాగా బాధిత కుటుంబానికి 1వ వార్డు కౌన్సిలర్ దేవోజు తిరుమల సదానందం 50 కిలోల బియ్యాన్ని మంగళవారం అందించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

రోడ్డుపై పడిన డబ్బులు..



వర్ధన్నపేట : మండలంలోని కదారిగూడెం గ్రామానికి చెందిన కంజర్ల రాజు, సారిక సోమవారం వర్ధన్నపేటకు వచ్చి ఏటీఎంలో నగదు డ్రా చేసుకున్నారు. తిరిగి ద్విచక్రవాహనంపై వెళ్తున్న క్రమంలో జాతీయ రహదారిపై కవరులోంచి రూ.500 నోట్లు రోడ్డుపై పడింది వీరు గమనించలేదు. రాత్రి ఇంటికి వెళ్లి చూసుకోగా కవర్‌లో డబ్బులు లేకపోవడంతో లబోదిబోమంటూ మంగళవారం పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. సోమవారం రోడ్డుపై నగదు దొరికిన వారి నుంచి రికవరీ చేసిన రూ.6,500ల డబ్బును బాధితులకు ఎస్సై రామారావు అందజేశారు.

విజయవంతం చేయాలి

ఖానాపురం : మండలంలోని ధర్మారావుపేటలో గల స్వయంభూ శ్రీదేవి, భూదేవి సమేత శ్రీపగడాల వేంకటేశ్వరస్వామి దేవాలయ ద్వితీయ వార్షిక కల్యాణోత్సవాలు రెండు రోజుల పాటు నిర్వహించనున్నారు. సర్పంచ్ వెన్ను శృతిపూర్ణచందర్, గుడి నిర్మాణ కర్త మాద్రాజు వెంకన్నల ఆధ్వర్యంలో బుధవారం ఉత్సవ విగ్రహాల ఊరేగింపు, 2న గురువారం కల్యాణ మహోత్సవాన్ని చేపట్టనున్నారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని చేయనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని సర్పంచ్ కోరారు.

రాజీనామా చేయాలి

గీసుకొండ : మండల వైస్ ఎంపీపీ రడం శ్రావ్య తన ఎంపీటీసీ పదవికి వెంటనే రాజీనామా చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తుమ్మనపెల్లి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ బీ ఫాం ద్వారా పోటీ చేసి ఎంపీటీసీగా గెలుపొందిన శ్రావ్య బీఆర్ఎస్‌లో చేరారని, ఆమె వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

వెండి ఆభరణాలు చోరీ

వర్ధన్నపేట : మండలంలోని రామోజీ కుమ్మరిగూడెం గ్రామానికి చెందిన నాంపెల్లి కేదారి ఇంట్లో సోమవారం చోరీ జరిగింది. తాళాలు పగులగొట్టి ఇంట్లోకి వెళ్లి బీరువా తలుపులు తెరిచి అందులో ఉన్న విలువైన ఆభరణాలను దోచుకుపోయారు. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం మధ్యాహ్నం తన భార్యతో కలిసి మొక్కజొన్న పంటకు నీరు పెట్టడానికి ఇంటికి తాళం వేసి చేను వద్దకు వెళ్లారు. సాయంత్రం తన కుమారుడు కళాశాల నుంచి ఇంటికి చేరుకునే సరికి ఇంటి తాళాలు పగులగొట్టి తలుపులు తెరిచి ఉండడంతో లోపలికి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉంది. వెంటనే తల్లిదండ్రుల వద్దకు వెళ్లి వారిని తీసుకు వచ్చి చూడగా బీరువాలో ఉన్న 8 గ్రాముల మాటీలు, 6 తులాల వెండి మొలతాడుతో పాటు 6 తులాల వెండి పట్టీలు దోచుకు పోయినట్లు గుర్తించినట్లు చెప్పారు. ఈ మేరకు మంగళవారం వర్ధన్నపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

టీకాలు వేయించాలి

శాయంపేట : పశువుల పెంపకందారులు తమ పశువులకు బ్రూసెల్లోసిస్ వ్యాధి నుంచి కాపాడుకోవడానికి తప్పక టీకాలు వేయించాలని పశువైద్యాధికారి సునీల్ అన్నారు. మంగళవారం మండలంలోని తహరాపూర్ గ్రామంలో సిబ్బందితో కలిసి లేగదూడలకు వ్యాధి నివారణ టీకాలు వేశారు. సర్పంచ్ తాటికొండ మౌనిక, రవికిరణ్, రమేష్‌బాబు, జేవీపీ సారంగం, సదానందం, రైతులు పాల్గొన్నారు.

వాకర్స్ అసోసియేషన్ ఎన్నిక

గూడూరు: మండల కేంద్రంలో మంగళవారం అబ్దుల్ కలాం వాకర్స్ అసోసియేషన్‌ను ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండి. ఖాసీం, అధ్యక్షుడిగా భూక్యా బాలు నాయక్, ఉపాధ్యక్షుడిగా బానోత్ లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి పెనుక ప్రభాకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వాంకుడోత్ గోపీనాథ్, కోశాధికారిగా బత్తుల శ్రీనివాస్, సాంస్కృతిక కార్యదర్శిగా లక్ష్మయ్యను మరో ఆరుగురిని సలహాదారులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఖాళీ బిందెలతో రాస్తారోకో

- తాగునీటి కోసం రోడ్డెక్కిన పెద్దతండా గిరిజనులు
- అధికారులు, పాలకులు పట్టించుకోవడంలేదని ధర్నా



జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేస్తున్న గిరిజనులు

నల్లబెల్లి : తాగునీటి కోసం గిరిజనులు రోడెక్కారు.. నాలుగు నెలలుగా ఇబ్బందులు పడుతున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆగ్రహించారు. తమ సమస్యను వెంటనే పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ ఖాళీ బిందెలతో స్థానిక మహిళలు రోడ్డెక్కి నిరసన వ్యక్తం చేశారు. ఈ సంఘటన మండలంలోని రుద్రగూడెం శివారు పెద్ద తండాలో మంగళవారం చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న నాయకులు గందె శ్రీనివాస్ గుప్తా, మల్లాడి విజేందర్ రెడ్డి రాస్తారోకో వద్దకు చేరుకున్నారు. సమస్యను పరిష్కరిస్తాం ఆందోళన విరమించాలని గిరిజనులతో చర్చించేందుకు ప్రయత్నించగా వారిపై గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. తాగునీరు లేక అనేక బాధలు పడుతున్నా తమను ఇప్పటి వరకు ఎవరు పట్టించుకోలేదని నిలదీశారు. వెంటనే తాగునీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ పిల్లాపాపలతో సుమారు గంటకుపైగా జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించి నిరసన తెలిపారు. దీంతో వాహనాలు రాకపోకలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు రాస్తారోకో వద్దకు చేరుకుని వారితో చర్చించారు. తాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటాం ఆందోళన విరమించాలని కోరడంతో గిరిజనులు రాస్తారోకో విరమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తండాలో ఉన్న బోర్లు మరమ్మతు చేయడంలేదన్నారు. తాగునీటి సమస్యను పరిష్కారించాలని పలుమార్లు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులను కోరిన పట్టించుకోవడం లేదని తెలిపారు. వ్యవసాయ బావుల నుంచి తాగునీరు తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. తాగేందుకు నీరు లేక అవస్థలు పడుతున్నామన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి నీటి సరఫరా చేసేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. లేనిచో ఎంపీడీఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నూనావత్ మంగ్యా, తిరుపతి స్థానికకులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధి పనులు ప్రారంభం



చెన్నారావుపేట: పనులు ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ



పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ ప్రకాశ్‌రావు

చెన్నారావుపేట : మండలంలోని గొల్లపల్లి గ్రామంలో మన ఊరు–మన బడి అభివృద్ధి పనులను జెడ్పీటీసీ బానోత్ పత్తినాయక్, ఎంపీటీ ప్రకాష్, సర్పంచ్ బానోత్ రమేష్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..అభివృద్ధి పనుల కింద రూ. 42 లక్షలు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో ఏఈ రాధాకృష్ణ, ఎస్ఎంసీ చైర్మన్ ధరావత్ రవి, లాలు, ధరావత్ భాస్కర్, భూక్యా శివ, బీఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షులు కన్నె విజేందర్, తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ఖానాపురం : ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు సూచించారు. ఈ మేరకు మండలంలోని బుధరావుపేటలో మన ఊరు–మనబడిలో భాగంగా హైస్కూల్‌లో రూ.58.38లక్షలు, ప్రాథమిక పాఠశాలలో రూ.40.30లక్షలు, ఉర్దూ మీడియం పాఠశాలకు రూ.3.50లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను మంగళవారం స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో ప్రభుత్వ పాఠశాలలను ఆదర్శంగా తీర్చిదిద్దాలన్నారు. నిర్మాణ పనులను నాణ్యత లోపంతో చేపడితే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కాస ప్రవీణ్‌కుమార్, ఎంపీటీసీ సుభాన్‌బీ, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకటనర్సయ్య, బీఆర్ఎస్ సోషల్ మీడియా మండల కన్వీనర్ దాసరి రమేష్, పసునూరి వెంకటేశ్వర్లు, రవి, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

‘కంటి వెలుగు’ను వినియోగించుకోవాలి



వర్ధన్నపేట: కళ్లద్దాలు అందజేస్తున్న రాజమణి



పర్వతగిరిలో.. ఎంపీపీ కమల తదితరులు

వర్ధన్నపేట : కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతీ ఒక్కరు వినియోగించుకోవాలని వర్ధన్నపేట రెండో వార్డు కౌన్సిలర్ తోటకూరి రాజమణి అన్నారు. మంగళవారం రెండో వార్డు పరిధిలోని కంటి వెలుగు శిబిరం భారతి డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు తుమ్మల రవీందర్, మంచాల రామకృష్ణ, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పర్వతగిరి : కంటి సమస్యతో బాధపడే వారు కంటి వెలుగు శిబిరాన్ని వినియోగించుకోవాలని ఎంపీపీ లూనావత్ కమల అన్నారు. ఈ మేరకు మండలంలోని హత్యాతండా గ్రామపంచాయతీలో మంగళవారం కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. కంటి పరీక్షలు చేయించుకున్న వారికి ఎంపీపీ కంటి అద్దాలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సీలమ్మవెంకట్రాం, మహ్మద్ సర్వర్, ఉపసర్పంచ్ తిరుపతి, కార్యదర్శి, గ్రామ అధ్యక్షుడు కిషన్, ప్రధానోపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న దొంతి మాధవరెడ్డి

చెన్నారావుపేట : మండలంలోని పాపయ్యపేటకు చెందిన నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు భూక్యా భాస్కర్ మంగళవారం బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాగా మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ బడుగు బలహీన వర్గాల కోసం పనిచేస్తుందన్నారు. మండల అధ్యక్షుడు భూక్యా గోపాల్‌నాయక్, జిల్లా కార్యదర్శి మొగిళి వెంకట్ రెడ్డి, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు అమీరొద్దిన్, ధర్మాతండా ఉప సర్పంచ్ వీరాసింగ్, భూక్యా శంకర్, రాజు, ఫయాజ్ ఉన్నారు.

అధికారుల సూచనలు పాటించాలి



రైతులకు సూచనలిస్తున్న ఏఓ శ్రీనివాస్

ఖానాపురం : పంటలకు ఆశించే తెగుళ్ల నివారణకు రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ సూచించారు. ఈ మేరకు బుధరావుపేట, భద్రుతండా, టేకులతండా, కోడ్తిమాడుతండా గ్రామాల్లో వివిధ రకాల పంటలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాటు వేసిన వరిలో నీరు పెడుతూ, ఆరబెడుతూ ఉండాలన్నారు. చలి తీవ్రత ఉన్నందున రాత్రి పెట్టిన నీటిని మరుసటి రోజు ఉదయం తొలగించి మళ్లీ నీరు పెట్టాలన్నారు. తద్వారా చలిబారీ నుంచి తట్టుకుని త్వరగా ఎదుగుతుందన్నారు. నాటు వేసిన వరిలో జింకుధాతు లోపం మచ్చల తెగులు ఆశించినట్లు గుర్తించామని, నివారణకు చిలామిన్ జింక్ సల్ఫేట్ 12శాతం(2.5గ్రా), కార్బండజిమ్ 12శాతం, మాన్‌కోజెబ్ 63శాతం(2గ్రా) లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. మొక్కజొన్న పంటకు కత్తెర పురుగు ఆశిస్తుందని, నివారణకు ఇమామెక్టిన్ జంబోహెట్ 80గ్రాములు లేదా క్లోరాంత్ర నిలిప్రోల్ 80ఎంఎల్ ఎకరానికి పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ రాజ్‌కుమార్, రైతులు మహాలక్ష్మి వెంకటనర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

‘ఫలించిన యూత్ కాంగ్రెస్ పోరాటం’



సమావేశంలో మాట్లాడుతున్న వేముల ఇంద్రదేవ్

నర్సంపేట : రాష్ట్ర యువజన కాంగ్రెస్ పోరాట ఫలితంగా ప్రభుత్వం కానిస్టేబుల్, ఎస్సై అభ్యర్థులకు 7మార్కులు కలపడం జరిగిందని నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు వేముల ఇంద్రదేవ్, ప్రధాన కార్యదర్శి తుమ్మలపల్లి సందీప్ అన్నారు. ఈ మేరకు పట్టణంలోని పార్టీ కార్యాలయంలో యువజన కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా కానిస్టేబుల్, ఎస్సై రాత పరీక్షలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు తప్పిదం వల్ల అన్యాయం జరుగుతుందని, అర్హత కలిగిన వారికి 7మార్కులు కలపాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. దీంతో రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడి సారథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ధర్నాలు, రాస్తారోకోలు, ప్రభుత్వ దిష్టిబొమ్మల దహనం, ఎస్పీ కార్యాలయం ముట్టడి, గవర్నర్‌ను కలిసి వినతిపత్రం అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రూపిక శ్రావణ్‌కుమార్, ములుకల మనీష్, కుక్కమూడి అశోక్, నెక్కొండ, నల్లబెల్లి మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పాల్గొన్నారు.

నేటినుంచి చింతలగట్టు సమ్మక్క–సారలమ్మ జాతర

గూడూరు: మండలంలో పేరుగాంచిన దామరవంచ సమీప జాతీయ రహదారి పక్కన చింతలగట్టు ఒట్టివాగు ఒడ్డున వెలసిన శ్రీశ్రీ సమ్మక్క సారలమ్మ మినీ జాతరకు ఏర్పాట్లు చేస్తున్నారు. నేటి (బుధవారం) నుంచి నాలుగు రోజుల పాటు జాతర నిర్వహణకు జాతర కమిటీ ప్రతినిధులు, పూజారులు సిద్ధమైయ్యారు. బుధవారం ఉదయం అమ్మవార్ల గద్దెల ప్రదేశం శుద్ధితో పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. 10గంటలకు గ్రామ ద్వార స్తంభాలు ప్రతిష్ఠిస్తారు. 2వ తేదీ అమ్మవార్ల గద్దెల వద్ద రహస్య పూజలతో పసుపు, కుంకుమ, అడవి పూలతో అలంకరిస్తారు. 3వ తేదీ భక్తులు మొక్కులు చెల్లించుట. 4న పూజలతో జాతర ముగుస్తుంది.

వెంటనే పింఛన్ బదలాయింపు

- భర్త మరణిస్తే భార్యకు తక్షణమే ఆసరా
- ప్రభుత్వం నూతన మార్గదర్శకాలు
- గతంలో వితంతు పింఛన్‌కు నిరీక్షణ
- జిల్లాలో 1,26,963 మందికి పింఛన్లు



ఆసరా పింఛన్ తీసుకుంటున్న లబ్ధిదారులు(ఫైల్)

ఖానాపురం : తెలంగాణ ప్రభుత్వం వితంతువులకు ఆసరాను మరింత చేరువ చేస్తోంది.. భర్త పింఛన్ తీసుకుంటూ మృతి చెందితే తక్షణమే ఆసరా పింఛన్‌ను భార్యకు బదలాయించి, అందించడానికి నూతన మార్గదర్శకాలను తీసుకువచ్చింది. భర్త మృతి చెందితే గతంలో కార్యాలయాల చుట్టూ ప్రదక్షణలు చేస్తూ నిరీక్షించే వారు.. ఇటీవల ప్రభుత్వం నూతన ఒరవడికి శ్రీకారం చుట్టడంతో వితంతువులకు ఆసరా తక్షణమే అందే అవకాశాలు ఉన్నాయి.

జిల్లా వ్యాప్తంగా 1,26,963 మందికి ప్రభుత్వం ఆసరా పింఛన్లు అందిస్తోంది. ఇందులో వృద్ధాప్య 48,675, వితంతు 47,794, దివ్యాంగులు 14,211, గీతకార్మికులు 3,004, చేనేత కార్మికులు 2,345, బీడీ కార్మికులు 5,714, ఒంటరి మహిళలు 3,220 మందికి పింఛన్లు పొందుతున్నారు. వీరికి ప్రతీ నెల రూ.28,79,55,096 నగదు మంజూరు చేస్తోంది. గతంలో భర్త మృతి చెందితే వితంతు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకుంటే రోజుల తరబడి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షణలు చేస్తూ నిరీక్షించాల్సి వచ్చేది. కానీ ప్రభుత్వం పేదలకు మరింత భరోసా కల్పించాలనే ఉద్దేశంతో పింఛన్ పొందుతున్న వ్యక్తి మృతి చెందితే తక్షణమే భార్యకు వితంతు పింఛన్ మంజూరుకు నూతనంగా ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ఉత్తర్వులను జిల్లా ఉన్నతాధికారులు ఆయా మండలాలు, పట్టణాల్లోని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం భర్త పింఛన్ తీసుకుంటూ మృతి చెందితే 15 రోజుల్లోనే భార్యకు వితంతు, వృద్ధాప్య పింఛన్‌లను మంజూరు చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. కేవలం భర్త పింఛన్ తీసుకుంటూ మృతి చెందితే భార్యకు తక్షణమే పింఛన్‌కు అర్హత లభిస్తుంది. కాగా పింఛన్ తీసుకోకుండా ఉన్న వ్యక్తి ఒకవేళ మృతి చెందితే దరఖాస్తు చేసుకోని మంజూరు అయ్యే వరకు వేచి చూడాల్సి ఉంటుందని అధికారులు తెలుపుతున్నారు.

ఇది నిరంతర ప్రక్రియ



ఆసరా పొందుతున్న వ్యక్తి మృతి చెందితే అతని భార్యకు తక్షణమే పింఛన్ మంజూరు చేయాలని ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చాయి. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శి, పట్టణాల్లో మున్సిపల్ కమిషనర్ లేదా బిల్‌కలెక్టర్‌లకు దరఖాస్తు అందించాలి. ఇప్పటికే మండలాలు, పట్టణాల్లోని అధికారులకు కలెక్టర్, డీఆర్డీఓ పీడీ సూచనలతో ఆదేశాలు జారీ చేశాం. దరఖాస్తు చేసుకున్న 15 రోజుల్లో మంజూరు వస్తుంది. ఆ తర్వాత నెల రోజులకు లబ్ధిదారులు పింఛన్ తీసుకోవాల్సి ఉంటుంది.

– పరమాత్మ, అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్, పింఛన్ విభాగం, వరంగల్

ఆధారాలతో దరఖాస్తు ఇలా..

వృద్ధాప్య పింఛన్ పొందుతూ భర్త మృతి చెందితే భార్య ఆధార్ కార్డుతో పాటు మృతుడి మరణ ధ్రువీకరణ పత్రం, ఫొటో, బ్యాంక్ ఖాతా పుస్తకాలతో దరఖాస్తును గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శికి, పట్టణప్రాంతాల్లో మున్సిపాలిటీ కార్యాలయ అధికారులకు అందించాల్సి ఉంటుంది. పంచాయతీ కార్యదర్శి దరఖాస్తులను ఎంపీడీఓ లాగిన్‌కు పంపితే అక్కడి నుంచి డీఆర్డీఓ కార్యాలయ లాగిన్‌కు వస్తుంది. వారు గుర్తించి మంజూరు కోసం హైదరాబాద్‌కు పంపిన తర్వాత 15రోజుల్లో పింఛన్ మంజూరు చేసి ఫిబ్రవరి నెల నుంచి అందించనున్నారు. ఇప్పటికే ఈ ప్రక్రియను జిల్లాలో ప్రారంభించారు.

నిరంతరం విద్యుత్ అందించాలి



నర్సంపేట: జేఏఓ సంపత్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



నెక్కొండ: సబ్ ఇంజనీర్ రాణికి వినతి..



చెన్నారావుపేటలో..

నర్సంపేట: కేసీఆర్ ప్రభుత్వం ఏసీడీ పేరుతో అదనపు విద్యుత్ చార్జీలను తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చంద్రన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు విద్యుత్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం జూనియర్ అకౌంట్ ఆఫీసర్ (జేఏఓ) సంపత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చంద్రన్న మాట్లాడుతూ ప్రజలపై డెవలప్‌మెంట్ పేరుతో ఆర్థిక భారాలను మోపడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ఏసీడీ పేరిట వసూలు చేస్తున్న అదనపు విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోవాలని, రైతాంగానికి నిరంతరాయంగా విద్యుత్ సరఫరాను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా నాయకులు చిర్ర సూరి, మాదా అశోక్, అడ్డూరి రాజు, అల్వాల నరేష్, కోడెం సారంగం, ధార లింగన్న, కందిక రమేష్, ఎండీ.ఖలీల్, రాజేందర్, శేఖర్ పాల్గొన్నారు.

విద్యుత్ కోతలు వద్దు

ఖానాపురం : రైతులకు 24 గంటల నిరంతర విద్యుత్‌ను అందించాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా నాయకుడు మాద అశోక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఆధ్వర్యంలో ఏసీడీ(అడ్వాన్స్‌డ్ కంజంప్షన్ డిపాజిట్) చార్జీలను ఉపసంహరించుకోవాలని, కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేపట్టాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని ఏఈ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అదనపు చార్జీల వసూళ్లతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యుత్ సరఫరా సరిగా అందించకపోవడంతో రైతుల పంటలు ఎండిపోతున్నాయని, తక్షణమే అధికారులు స్పందించి కోతలు లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సమ్మయ్య, లింగయ్య, సారంగం, మల్లన్న, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.



ఖానాపురం: ఏఈకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకులు

నెక్కొండ : ఉచిత విద్యుత్ అందిస్తున్నామంటునే ప్రజల నుంచి అదనపు విద్యుత్ చార్జీలు వసూలు చేయడం సిగ్గుచేటని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నెక్కొండ, చెన్నారావుపేట మండలాల కార్యదర్శి అడ్డూరి రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలోని విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలపై అదనపు చార్జీల భారం మోపడం సరికాదన్నారు. వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్‌ను అందించాలన్నారు. సబ్ ఇంజనీర్ రాణికి వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కత్తుల కొంరయ్య, చంద్రమౌళి, అల్వాల యాకయ్య, భద్రు, భీమా నాయక్, నరేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు గతే కేసీఆర్‌కు పడుతుంది

చెన్నారావుపేట : అదనపు విద్యుత్ చార్జీల వసూలు నిలిపివేయకపోతే చంద్రబాబుకు పట్టిన గతే కేసీఆర్‌కు పడుతుందని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా నాయకుడు చిర్ర సూరి హెచ్చరించారు. ఈ మేరకు మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ ఎదుట విద్యుత్ చార్జీల వసూళ్లను నిలిపివేయాలని, కోతలు లేకుండా రైతులకు 24గంటల నాణ్యమైన కరెంట్ అందించాలని మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని ఏఈ జోగానంద్‌కు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం నాలుగు సంవత్సరాలుగా రాష్ట్ర విద్యుత్ మండలికి రూ.33వేల కోట్లు బకాయి ఉందన్నారు. ఈ లోటును భర్తీచేయడానికి ప్రజలపైన డెవలప్‌మెంట్ పేరుతో విద్యుత్ చార్జీలు వసూలు చేస్తు మోయలేని భారం వేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. లో ఓల్టేజీ సమస్య, నిరంతర కోతలతో మోటర్లు, ఇళ్లల్లోని వస్తువులు కాలిపోతున్నాయని ఆరోపించారు. వెంటనే ప్రభుత్వం అదనపు విద్యుత్ చార్జీల వసూళ్లను నిలిపివేసి కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. లేనిఎడల ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు అలువాల నరేష్, రాము, సారంగం, కొమ్మాలు, జావీద్, యాకన్న, రమేష్‌తో పాటు తదితరులు ఉన్నారు.

బీజేపీ నాయకుల ధర్నా



వర్ధన్నపేట : వ్యవసాయానికి 24 గంటల విద్యుత్, సామాన్య వినియోగదారులకు తక్కువ ధరకు కరెంట్ అందిస్తామని చెప్పిన బీఆర్ఎస్ ప్రభుత్వం మాట తప్పి రైతులను, ప్రజలను అరిగోస పెడుతోందని బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షుడు కర్ర సోమిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రాయపురం కుమారస్వామి దుయ్యబట్టారు. రైతులకు 24గంటలు ఉచిత విద్యుత్ అందించాలని, ఏసీడీ చార్జీలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం వర్ధన్నపేట విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు చీటూరి రాజు, కొండేటి సత్యం, పెద్దూరి రాజు, బోయినపెల్లి దేవేందర్ రావు, ఐత రవికుమార్, విక్రమ్, మహేందర్ రెడ్డి, కొండేటి బాబు, సోమేశ్వర్‌రావు, రాకేష్, రాంరాజ్, తేజ్యా, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలు వసూలు చేయాలి

డీపీఓ కల్పన



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న డీపీఓ కల్పన

నల్లబెల్లి: గ్రామ పంచాయతీ పరిధిలో నిర్వహిస్తున్న వారాంతపు సంత రహదారికి సంబంధించి బకాయిలు వెంటనే వసూలు చేయాలని డీపీఓ కల్పన పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీ రికార్డులు, అభివృద్ధి పనులను పరిశీలించారు. నెక్కొండ గ్రామ పంచాయతీ నిర్వహిస్తున్న అంగడి టెండర్‌కు సంబంధించిన రూ.6 లక్షల బకాయిలను ఎందుకు వసూలు చేయడంలేదని ప్రశ్నించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పల్లె ప్రగతి అభివృద్ధి పనులపై ఎంపీడీఓ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇంటి పన్నులు సకాలంలో వసూలు చేయాలన్నారు. ఈ కార్యక్రమాల్లో ఉపసర్పంచ్ వీరభద్రం, ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, ఎంపీఓ కైసర్‌పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.